# ఎక్కడైనా బావే..... కానీ....

ఆటో మరోసారి ఆగింది.

నాకు చిరాకు వేసింది. స్టేషన్ నుంచి ఒక కిలోమీటరు దూరం వచ్చామో, లేదో కానీ, ఆటో ఆగటం యిది ఐదోసారి.

తల బయటకు పెట్టి చూసాను. ఎదురుగా మరో వినాయక విగ్రహం - పూజ.

గమ్యము తెలిసినా ప్రయాణోద్దేశము తెలియక పరుగెత్తి మబ్బుల మధ్యన చిక్కుకున్న సూర్యుడు నన్ను సానుభూతితో చూస్తున్నాడు.

ఓ సిగరెట్టు వెలిగించాను. నన్ను హైదరాబాదు ఎందుకు రమ్మన్నారు?

"ప్రమోషన్ యిస్తారేమోనండీ" హైదరాబాదు రమ్మన్న మాట వినగానే మా ఆవిడ అంది తెల్లగుడ్డ మీద పూసలతో తన ఊహల్లో వున్న యిల్లు కుట్టుకుంటున్న ఆవిడ వదనము విద్యుత్తు అందుకున్న నియోన్ బల్బులా వెలిగింది.

"ఓసి పిచ్చి మొహమా" నాకు నవ్వు వచ్చింది" ప్రమోషన్ యివ్వటానికి హైదరాబాదు పిలిపించనక్కరలేదే."

"మరి ఎందుకండీ?"

...............

"ఎందుకు రమ్మన్నారని నాకూ అర్ధము కావటము లేదు. ఎన్నిరోజులు వుండవలసి వస్తుందో, ఏమో!" పెట్టె సర్దుతూ అన్నాను నేను.

"నాకు అర్ధమయి పోయిందండీ" హఠాత్తుగా అరచింది, మా ఆవిడ" నూతన శాస్త్ర సిద్ధాంతము కనిపెట్టినప్పుడు పరుగెత్తుకొచ్చిన "ఆర్కిమెడీస్"లా వంటగదిలో నించి పరుగెత్తుకొస్తూ "మీ బావకి మిమ్మల్ని చూడాలని బుద్ధిపుట్టి వుంటుంది"

మా ఆవిడ అమాయకత్వానికి నవ్వాలో, ఏడ్వాలో తోచలేదు నాకు, ఆఫీస్

అంటే యిల్లులాగే వుంటుందని, అనుకుంటుంది మా ఆవిడ.

"గత రెండు ఏళ్ళుగా మీ బావగారు మన వూరు రాలేదుగా మనమూ వెళ్ళలేదు"
"అందుకు..."

"అందుకే. ఆఫీసు పని వుందన్న వంకతో మిమ్మల్ని రమ్మని వుంటారు. మీ బావే కదా మీ బాస్"

"నిజమే! మా బావే నాకు బాస్. రాష్ట్ర వ్యాప్తంగా వుండే ఓ ప్రభుత్వ కార్యాలయ శాఖలకు, అందులో పనిచేసే నాలాంటి వందలాది ఇంజనీర్లకూ, మా బావే బాస్.

ఆటో ఆఫీసు దగ్గర ఆగింది.

"వచ్చేసెరా అండీ" పలుకరించేడు మా బావగారి బంట్రోతు. "లోనికి వెళ్ళండి మీ గురించే ఎదురు చూస్తున్నారండీ." అతని మాటల్లో కొద్దిగా వెటకారం ధ్వనించింది.

"ఇంత హఠాత్తుగా పలిపించావేంటి బావా?" లోనికి వెళుతూనే ఆతృతగా అడిగేను.

చూస్తున్న ఫైలునుంచి ఓ సారి దృష్టి మళ్ళించి నా వైపు చూసాడు. అతను మళ్ళీ ఫైలు చూడటంలో మునిగిపోయాడు.

నాకు ఆశ్చర్యం వేసింది. చూడగానే ఆప్యాయంగా పలుకరించేవాడు. యోగక్షేమాలు అడిగేవాడు. కానీ ఈ రోజు......

కుర్చీలో కూర్చుంటూ యధాలాపంగా చూసాను. గదిలో చాలా మార్పులు వచ్చేసాయి.

మా బావ కుర్చీ వెనుక గోడమీద తగిలించి వుంచిన 'గీతోపదేశము' ఛాయా చిత్రము అక్కడ కనపడలేదు. ఆ స్థానములో మనిషి మీదకు ఉరికే పులిబొమ్మ ఫోటో చోటు చేసుకుంది.

"పోనీ గదా అనుకుంటే మరీ శృతిమించిపోతున్నారు" ఫైలు చూస్తూ అన్నారు బావ. "వేలు దూర్చనిస్తే తల దూర్చే రకం"

"ఎవరి గురించి అలా అనుకుంటున్నావ్?" నేను వుండలేకపోయాను.

"ఒకరి గురించని ఏమిటి? అందరి గురించీను, నీతో సహా"

"నేనా! నేనేం చేసాను బావా?"

"ఏం చేసావో చూడు." అతను ఒక కాగితం నాముందు పడేసాడు." మేనమామ కొడుకువి కదా, నా బావమరిదివి కూడా కదానని వూరుకుంటుంటే..."

ఆ కాగితం తీసి చదివాను. అది గతనెల నేను పంపిన నివేదికే.

"ఏమిటి అలా కళ్ళప్పగించి చూస్తున్నావ్?" అతను కోపంగా అడిగేడు.

"అది నీ రిపోర్టు. గతనెల ఎన్ని ఇన్‌స్పెక్షన్స్ చేసావ్?"

"పది"

"మరి, మాకు తొమ్మిదికే కదా అందేయి మామూళ్ళు"

"అది కాదు బావా"

"కథలు చెప్పమాకు రావాల్సినది యివ్వక మొత్తం మింగేసావా? అంత పెద్ద వాడివయిపోయావన్నమాట!"

నాకేమనాలో తోచలేదు. రెండు నెలల క్రితం నా చిన్ననాటి స్నేహితుడు నా పరిధిలో వున్న ఒక కర్మాగారములో చేరాడు. ఆ కర్మాగారానికి సంబంధించిన కొన్ని కాగితాలు నా సంతకం కొరకు మా కార్యాలయంలో వుండిపోయాయి. అతను ఆ కాగితాల గురించి ఓ పదిసార్లయినా వచ్చి వుంటాడు.

"నేను యింక రానురా" చివరకు విసుగెత్తి అన్నాడు అతను."నువ్వు సంతకం చేసి పంపదలచుకుంటే పంపు, ఏవో వస్తాయని అనుకుంటున్నానంటే, నువ్వు పొరపాటు పడుతున్నావు"

"అది కాదు రా....." నేను చెప్పబోయాను.

"నువ్వేమీ చెప్పకు." అతను అన్నాడు. "దయ వుండి నువ్వు కాగితాలు సంతకం చేసి పంపుతే ఈ ఉద్యోగము చేసుకుంటాను. లేకపోతే యింకొక ఉద్యోగం వెతుక్కుంటాను.

"అదేమిటరా?"

"అది అంతేరా నీ చేత సంతకాలు పెట్టించలేని నేను చేతగానివాడిగానే కనిపిస్తాను మా యాజమాన్యానికి. పని చెయ్యడం చేతకానివాడితో వాళ్ళకేంపని!" వాడు వెళ్ళిపోయాడు.

నాకు బాధ కలిగింది. మామూలు గురించి చూడకుండా, ఆ ఫైలు తెప్పించాను, సంతకాలు అయిపోయాయి.

"ఇదిగో ఈ కాగితం తీసుకొని సంతకము పెట్టు" మా బావ అన్నాడు.

"ఏమిటిది?"

"నీ బదిలీ కాగితాలు"

"బదిలీయా!"

"అవును నిన్ను...... భద్రగిరికి బదిలీ చేస్తున్నాను. అక్కడ నీకే గొడవ వుండదు. ఎందుకంటే అక్కడ చెప్పుకోదగ్గ కర్మాగారాలేమీ లేవు"

నా గుండెల్లో రాయి పడింది.

"బావా అక్కడ......" నేను నీళ్ళునములుతూ అన్నాను." అక్కడ పిల్లలకు బడీ....."

"ఏమీ మాట్లాడకు. నేను నీ బావను కనుక బదిలీ చేసి వూరుకుంటున్నాను. ఇదే యింకొకరయితే ఏదో కేసులో యిరికించి, సస్పెండ్ చేయించేవారు తెలుసా?"

నాకు నోటమాట రాలేదు.

సంతకం పెట్టి బదిలీ కాగితాలు అందుకున్నాను.

గదిలో నుంచి బయటకు వస్తుంటే గణపతి నవరాత్రులు వారు వేసిన ఆ పాట వినిపించింది.

"ఎక్కడైనా బావా అంటే...."

రాఘవీస్ కోకిల మార్చి 1996